సాక్షి
మెదక్

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



గొర్రెల పంపిణీ ఎక్కడ?

సిద్దిపేట జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వివరాలు 8లో ▸



సూపర్ బ్రెయిన్‌తో..

సూపర్ బ్రెయిన్‌తో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించవచ్చని నిపుణుడు నర్సింహారెడ్డి అన్నారు. వివరాలు 8లో ▸

రేగోడ్‌కు నేడు దామోదర

రేగోడ్(మెదక్): రేగోడ్ గ్రామానికి ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు శనివారం తెలిపారు. అదేవిధంగా మర్పల్లి, కొత్వాన్‌పల్లి, టి.లింగంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ఉన్నాయని చెప్పారు.



ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్, రామాయంపేట

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 09-10-2023

సమయం: సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

అంశం:

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తి, వ్యాధుల తీవ్రత, శిథిల రహదారుల సమస్యలపై ఫోన్ ఇన్.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:

7989695428

ఆమెదే ఆధిక్యం



జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

- మొత్తం ఓటర్ల సంఖ్య 4,34,275
- మహిళలు 2,24,337, పురుషులు 2,09,938
- పురుషుల కంటే 14,399 మంది స్త్రీలు అత్యధికం
- అభ్యర్థుల గెలుపోటములు వారి చేతిలోనే..



మెదక్: జిల్లా ఓటర్ల లెక్క తేలింది. ఎన్నికల సంఘం ప్రత్యేక సవరణ 2023లో భాగంగా ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల సంఘం ఈనెల 4న విడుదల చేసింది. ఈ జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించడంలో వారి ఓట్లే కీలకంగా మారే అవకాశం ఉంది.

జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల వారీగా తుది ఓటరు జాబితాను కలెక్టర్ రాజర్షిషా ప్రకటించారు. మార్పులు, చేర్పులతో పాటు 18ఏళ్లు నిండిన వారికి ఈ జాబితాలో చోటు కల్పించారు. జిల్లాలో 4,34,275 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. గత ఆగస్టు 21న ముసాయిదా జాబితాను ముందుగా విడుదల చేశారు. ఇందులో నుంచి అభ్యంతరాల స్వీకరణ, చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించారు. ఆగస్టు 26 , 27 తేదీలతో పాటు సెప్టెంబరు 2, 3 తేదీలలో మరోసారి ఓటరు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. చివరిగా సెప్టెంబరు 19వ తేదీ వరకు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను, పరిశీలించిన అధికారులు తుది జాబితాను విడుదల చేశారు.

భారీగా పెరిగిన ఓటర్లు

జిల్లాలో నూతన ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. 2018లో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య 3,97,997ఉండగా, ఐదేళ్లలో 36,278 మంది ఓటర్లు పెరిగారు. ఓటర్ల సంఖ్య పెరగడానికి అధికారులు విస్తృత ప్రచారం చేశారు. నియోజకవర్గాల్లో మొబైల్ వాహనం ఏర్పాటు చేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 579 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,34,275 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. ఇందులో పురుషులు 2,09,938 , మహిళలు 2,24,337 ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు 14,399 ఎక్కువగా ఉన్నారు.

మహిళల ఓట్లే శాసనం

ఓటర్ల తుది జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేలింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వీరి ఓటే శాసనం కానుంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. మెదక్‌లో 1,02,340 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళలు 1,11,724 మంది ఉన్నారు. అంటే ఇక్కడ మహిళలు 9,384 మంది అధికంగా ఉన్నారు. అదేవిధంగా నర్సాపూర్‌లో పురుష ఓటర్లు 1,07,587మంది ఉండగా, మహిళలు 1,12,617 మంది ఉన్నారు. ఇక్కడ 5,030 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. యువత కూడా కొత్తగా ఓటరు నమోదు చేసుకుంది. 18–19 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువ ఓటర్లు 15,596 మంది ఉన్నారు. ఇక దివ్యాంగ ఓటర్లు 8,863 మంది ఉన్నారు. కాగా పురుషుల కన్నా మహిళా ఓటర్లు అధికంగా ఉండటంతో గెలుపోటములను నిర్ణయించే శక్తి మహిళామణులకే ఉందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటి నుంచే వారిని మచ్చిక చేసుకునేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రధాన పార్టీలు కూడా వారి కోసం అనేక పథకాలు ప్రవేశ పెడతామని ప్రకటనలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నాయి.

కాంగ్రెస్‌కు దోచుకోవడమే తెలుసు

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి ముడిపడి ఉందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఖాజాపూర్‌లో పల్లె దవాఖానా భవన నిర్మాణానికి, యాదవ, ముదిరాజ్, అంబేద్కర్, మున్నూరుకాపు భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి కోరిక మేరకు మహిళా భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మిర్జాపల్లి గ్రామపంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెసోళ్లు ఎప్పుడు దోచుకుందామా అని చూస్తారని అన్నారు. కార్యక్రమంలో ఖాజాపూర్ సర్పంచ్ నాగమణి, మిర్జాపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాష్పల్లి యాదగిరి, ఉపసర్పంచ్ ఉపేందర్ రెడ్డి, మహేష్‌గౌడ్, కుంట నరేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ జెడ్పీటీసీ పోతరాజ్ రమణ కృపావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

ఆయిల్‌పామ్‌పై దృష్టి సారించాలి



ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ చేస్తున్న అధికారులు

ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నర్సయ్య

వెల్దుర్తి(తూప్రాన్): ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నర్సయ్య సూచించారు. మాసాయిపేట మండలం హకీంపేట గ్రామ శివారులోని సంపత్‌రావ్ వ్యవసాయ భూమిలో శనివారం ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలో డ్రిప్ ఏర్పాటుకు 141 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. సుమారు 900 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు 400 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 92ఎకరాలకు అనుమతి మంజూరైందన్నారు. అందులో భాగంగానే హకింపేట శివారులో 15 ఎకరాల్లో ప్లాంటేషన్ చేసినట్లు చెప్పారు. ఒక్కో రైతు పన్నెండున్నర ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చని, సబ్సిడీ కింద ఎకరాకు ప్రభుత్వం రూ.52వేలు అందజేస్తుందన్నా రు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు స్టేషన్ శ్రీను, లివింగ్‌హుడ్ కంపెనీ ప్రతినిధులు రంగాచారి, కృష్ణ, మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఈఓ రజిత పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్నెస్



గౌరవ వందనం స్వీకరిస్తున్న మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: రెగ్యులర్‌గా హెల్త్ చెకప్స్ చేయించుకోవడంతోపాటు వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్ వస్తుందని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డ్ సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బందికి వ్యాయామం చాలా ముఖ్యమని, ఫిట్నెస్‌ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, ఆర్ఐ అచ్యుతరావు, ఎస్ఐ వెంకట్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు నరేష్, మహిపాల్, యశ్వంతరావు పాల్గొన్నారు.


సబ్జెక్టులపై పట్టు సాధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సత్యనారాయణ

రామాయంపేట(మెదక్): విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించి కష్టపడి చదవాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ సూచించారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంగ్లం బోధించే అధ్యాపకులకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, లెక్చరర్లు మల్లేశం, బాలప్రకాశ్, బాబూరావు, బాలాగౌడ్, అశోక్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, ఆంజనేయులు, సురేశ్, శ్రీశైలం, యాదగిరి, మస్తాన్, శ్రీదేవి పాల్గొన్నారు.

కల్లు డిపోల్లో శాంపిల్స్ సేకరణ



కల్లు శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): మెదక్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం మండలంలోని కాట్రియాల, లక్ష్మాపూర్ గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో శాంపిల్స్ సేకరించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్ ఆధ్వర్యంలో కల్లు కల్తీ జరిగిందా లేదా అని టెస్ట్ చేశారు. కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

15 నుంచి శరన్నవ రాత్రోత్సవాలు

పాపన్నపేట(మెదక్): ఈ నెల 15 నుంచి ఏడుపాయల్లో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు జరుగుతాయని పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అక్టోబర్ 20న బోనాలు, 22న చండీ హోమం ఉంటుందన్నారు. ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

అల్పాహారం ఎలా ఉంది?

విద్యార్థులను అడిగి తెలుసుకున్న డీఈఓ

శివ్వంపేట (నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శనివారం మండల పరిధి చిన్న గొట్టుముక్కల ఉన్నత పాఠశాలలో అల్పాహారంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అల్పాహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్యా నాయక్, సర్పంచ్ బాలామణి, ఇన్‌చార్జి హెచ్ఎం ఇందుమతి ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

నర్సాపూర్: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. ఆయన శనివారం పట్టణంలోని పలు పాఠశాలలు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పరీక్షలు నిర్వహించాలని ఆయన చెప్పారు. ఆయన వెంట అధికారులు సుదర్శనమూర్తి, ప్రవీణ్, సీఆర్‌పీలు నర్సింహచారి, సుజాత తదితరులు ఉన్నారు.



అల్పాహారాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

ఎవడబ్బ సొమ్మని దోచుకున్నారు?

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

పాపన్నపేట(మెదక్): బీఆర్ఎస్ అగ్రనాయకులు దోచుకున్న రూ.లక్షల కోట్లు ఎవడబ్బ సొమ్మని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ప్రశ్నించారు. శనివారం లక్ష్మీనగర్‌లో జరిగిన పాపన్నపేట మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, దళిత బంధు అందరికీ ఇవ్వకపోతే బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను తన గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని స్పష్టం చేశారు. యువ నాయకుడు రోహిత్ మాట్లాడుతూ.. సిద్దిపేట, గజ్వేల్‌కు ధీటుగా మెదక్‌ను అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఏడుపాయలలో మెదక్ ఎల్ఐసీ ఏజెంట్లతో మైనంపల్లి సమావేశమయ్యారు. అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి రూ.15 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

కాంగ్రెస్ నేతలను నిర్బంధిస్తే విజృంభిస్తాం

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ నాయకులనైనా పోలీసులు సమానంగా చూడాలని, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని మైనంపల్లి హెచ్చరించారు. శనివారం హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులపై బనాయించిన అక్రమ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికార యంత్రాంగం కాంగ్రెస్ నాయకులను టార్గెట్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తాము కార్లలో డబ్బులు తీసుకువస్తున్నామంటూ అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారని, తాను డబ్బులు పంచాల్సిన అవసరం లేదని, తాను చేసిన సేవలను గుర్తించి ప్రజలు స్వచ్ఛందంగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు గోవింద్, పీసీసీ సభ్యులు సుప్రభాత్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, రాజిరెడ్డి, గంగానరేందర్, జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంత్‌రావు

రెండేళ్లలో కాళేశ్వరం జలాలు

జహీరాబాద్‌లో ప్రతీ ఎకరాకు అందిస్తాం

- నియోజకవర్గానికి మరో 2 వేల గృహలక్ష్మి ఇళ్లు
- బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: వచ్చే రెండేళ్లలో కాళేశ్వరం జలాలను సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా జహీరాబాద్‌కు తీసుకువచ్చి సాగుకు అందిస్తామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. శనివారం రాత్రి ఆయా పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ముందుగా రూ.35 కోట్లతో నిర్మించిన 660 డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం స్థానిక బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావును గెలిపించాలని కోరారు. నియోజకవర్గానికి మూడు వేల గృహలక్ష్మి ఇళ్లను మంజూరు చేశామని స్పష్టం చేశారు. ఇవేకాక మరో 2వేల గృహాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో రూ.175 కోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.204 కోట్లు బ్యాంకు లింకేజీ కింద అందజేశామని వెల్లడించారు. 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు చెప్పే మాటలు నమ్మకుండా బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించుకోవాలన్నారు. ఆ పార్టీకి ఓటేస్తే కైలాసానికే వెళ్తారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయా కుల సంఘాల భవన నిర్మాణం కోసం స్థల పట్టాలు అందజేశారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్యను త్వరలో పరిష్కరించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, ఎంపీ బీబీ పాటిల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, డీఆర్‌యూసీసీ మెంబర్ షేక్‌ఫరీద్, బీఎస్ఎన్ఎల్ సభ్యుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాగన్న విగ్రహావిష్కరణ


పట్టణంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే సి.బాగన్న విగ్రహాన్ని మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు ప్రజల కోసమే పాటు పడ్డారన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బాగన్న కుటుంబ సభ్యులు, ముదిరాజ్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రారంభం

కోహీర్(జహీరాబాద్): మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర, బాలికల డిగ్రీ కళాశాలను మంత్రి టి.హరీశ్‌రావు ప్రారంభించారు. మండలంలోని కవేలి క్రాస్ రోడ్డు వద్ద టూరిజం భవనంలో కొత్తగా మంజూరైంది. కాగా శనివారం రాత్రి జహీరాబాద్ నుంచి సంగారెడ్డికి వెళుతూ మార్గమధ్యలో ఆగి ప్రారంభించారు.

నాలుగులేన్ల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రం ఝరాసంగంలో రూ.500 కోట్ల నిధులతో నిర్మించనున్న నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని బిడకన్నెలో 96 మంది రైతులకు 144 ఎకరాలకు సంబంధించిన లావణి పట్టా పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని మంత్రి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన బోర్లను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. రుణ మాఫీ డబ్బులు రాలేదని రైతులు అడుగగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు జగదీశ్వర్, రజినీప్రియ, సంతోష్ పాటిల్ పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

బాలల హక్కులు పరిరక్షించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మిశారద

మెదక్ మున్సిపాలిటీ: పిల్లల ప్రాథమిక హక్కులను రక్షించడం అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మిశారద పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా కోర్టులో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి బాలల హక్కుల పరిరక్షణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలు, బాలల చదువు, వారి హక్కులపై చర్చించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పిల్లల హక్కులకు భంగం కలగకుండా చూడాలని, వారి అవసరాలను గుర్తించి స్వేచ్ఛాయుత వాతావరణం, జీవనాన్ని అందించాలని వివరించారు. పిల్లలు తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి న్యాయమూర్తి షాలిని షాకేలి, రీటా లాల్‌చంద్, కల్పన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మిశారద

కనీస వేతనాలు ఇవ్వాలి

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు జీఓ 60 ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు ర్యాలీగా వెళ్లి మిషన్ భగీరథ డీఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నెలకు రూ.10 వేలు ఇవ్వడం దారుణమన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, యూనియన్ నాయకులు బాబయ్య, స్వామి, లక్ష్మణ్, బాలు, సంతోష్, రాములు పాల్గొన్నారు.

పెండింగ్ బియ్యం డెలివరీ చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: రైస్ మిల్లర్లు పెండింగ్‌లో బాయిల్డ్, రా రైస్‌ను త్వరితగతిన డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బియ్యం డెలివరీ గడువు నవంబర్ 30తో ముగుస్తుందని తెలిపారు. జిల్లా నుంచి ప్రతీరోజు ఎఫ్‌సీఐకి సుమారు 60ఏసీకేల(17,400 క్వింటాళ్లు)బియ్యం, సివిల్ సప్లైయిస్‌కి 70ఏసీకేల బియ్యం సరఫరా చేస్తే లక్ష్యం పూర్తవుతుందని తెలిపారు. లేదంటే మిల్లర్లు డిఫాల్ట్‌గా మిగిలిపోతారని హెచ్చరించారు. అలా జరిగితే 125 శాతం డబ్బు రూపంలో మిల్లర్ల నుంచి రికవరీ చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల, జిల్లా మేనేజర్ హరికృష్ణ, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

లోన్‌ పేరుతో రూ.2.35 లక్షల స్వాహా

లోన్‌ పేరుతో రూ.2.35 లక్షల స్వాహా

పటాన్‌చెరు టౌన్‌: లోన్‌ ఇప్పిస్తామని ఆశ చూపి ఒకరి నుంచి రూ.2.35 లక్షలు దోచుకున్న ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ మండలం పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి గత ఏడాది మే 31న కోటి రూపాయల లోన్‌ ఇప్పిస్తామని ఫోన్‌కాల్‌ వచ్చింది. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తులు చెప్పిన దానిని నమ్మి రూ.2.35 లక్షల చెల్లించాడు. లోన్‌ ప్రాసెస్‌లో ఉందని చెప్పి నమ్మిస్తూ వచ్చారు. చివరికి బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం అమీన్‌పూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై న్యూసెన్స్‌ కేసు

నారాయణఖేడ్‌: మండల పరిధిలోని జూకల్‌ గ్రామంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి శుక్రవారం రాత్రి పలు పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వినయ్‌, నరేష్‌, మల్లప్ప, వీరన్న మద్యం మత్తులో న్యూసెన్స్‌ సృష్టించారని ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. వారిపై కేసున మోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయికి తిగుల్‌ విద్యార్థులు



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మండలంలోని తిగుల్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికై నట్టు పాఠశాల పీఈటీ రవికుమార్‌ తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో అండర్‌ 17 విభాగంలో పావని, స్రవంతి ప్రతిభ చాటారు. అండర్‌14 విభాగంలో ప్రణతి, ప్రవల్లిక, అనిల్‌ ప్రతిభ చాటారు. వారంతా వనపర్తి, కొమురంభీమ్‌, అసిఫాబాద్‌ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. సర్పంచ్‌ భానుప్రకాష్‌రావు, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ భూమయ్య విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ ఎక్కడ?

- నాలుగు నెలల్లో 1,160 మందికే
- డీడీలు చెల్లించినా.. పంపిణీలేదు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



గొర్రెల మందను అడ్డుగా పెట్టి ఎంపీకి నిరసన తెలుపుతున్న గొల్ల కురుమలు (ఫైల్‌)

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్‌ 9న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాలుగు నెలలల్లో 1,160 మంది లబ్ధిదారులకు మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారు. ఇదే విధంగా కొనసాగితే మరో ఆరు నెలలు గడిచినా మొత్తం యూనిట్‌ల పంపిణీ జరగదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడతకు 16 వేల యూనిట్‌లు

జిల్లాలో మొత్తం 412 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలు ఉండగా 32,452 మంది సభ్యులు ఉన్నారు. 2017లో మొదటి విడతలో 15,720 పంపిణీచేసి, రెండో విడతలో 16,732 మందికి పంపిణీ చేసేందుకు ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ప్రభుత్వం గొల్ల కురుమలకు 75 శాతం సబ్సిడీ కింద ఒక యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందిస్తారు. 2017లో ఒక్కో యూనిట్‌కు రూ.1.25 లక్షలు నిర్ణయించగా అందులో లబ్ధిదారుడు రూ.31,250 డీడీ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండేది. ప్రభుత్వం ఇచ్చే రూ.1.25 లక్షలతో 21 గొర్రెలు రాకపోవడంతో మరో రూ.50 వేలు పెంచుతూ యూనిట్‌ ధరను రూ. 1.75లక్షలుగా నిర్ధారించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు రూ.43,750లు డీడీ రూపంలో చెల్లించాలి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సంక్షేమ దినోత్సవం జూన్‌ 9 నుంచి రెండో విడత పంపిణీకి శ్రీకారం చుట్టారు.

6,563 మంది డీడీలు అందజేత

గొర్రెలను కర్నూల్‌, అనంతపురం, గుంటూరు ప్రాంతంలోనే కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 6,563 మంది లబ్ధిదారులు గొర్రెల కోసం డీడీలను అందించారు. నెలలు గడుస్తున్నా గొర్రెల పంపిణీ చేయపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వివిధ గ్రామాల్లో డీడీలు చెల్లించినవారు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్‌ వస్తే నిలిపివేస్తారేమో అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

5 నెలలుగా ఎదురుచూస్తున్నాం..



గొర్రెల కోసం డీడీలు తీసి 5 నెలలు కావస్తోంది. అధికారులను అడిగితే రేపు.. మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రూ 43,750 కట్టి డీడీ తీసి మా ఊరు డాక్టర్‌కు ఇచ్చాం. గొర్రెలు ఎప్పుడిస్తారో ఎవరూ సరిగ్గా చెప్పడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్‌ వస్తే మా పరిస్థితి ఏమిటో? ఇప్పటికైనా అధికారులు అత్వరగా పంపిణీ చేయాలి.

- పీరెల్ల రవి, అక్కన్నపేట

త్వరగా పంపిణీ చేయాలి..



2017 సంవత్సరంలో గొర్రెల పంపిణీ కోసం డ్రా తీస్తే రెండో విడతకు ఎంపికయ్యాను. గొర్రెల పంపిణీ కోసం మే నెలాఖరున రూ.43 వేలు డీడీ రూపంలో చెల్లించాను. ఇప్పటికి ఐదు నెలలు గడిచింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొర్రెలను త్వరగా పంపిణీ చేయాలి.

- తుమ్మల గణేష్‌, దౌల్తాబాద్‌

ఆందోళన చెందొద్దు

రెండో విడతలో ఎంపికైన వారందరికీ తప్పకుండా గొర్రెలను అందజేస్తాం. దశల వారీగా లబ్ధి దారులను పంపిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ లబ్ధి దారులు ఎవరూ ఆందోళన చెందొద్దు.

- సత్యపాల్‌ రెడ్డి, ఇంచార్జి పశుసంవర్థక శాఖ

డిమాండ్ల ప్లకార్డులతో..

- మహిళా ఆపరేటర్ల నిరసన



నిరసన తెలుపుతున్న కంప్యూటర్‌ ఆపరేటర్లు

మెదక్‌ కలెక్టరేట్‌: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టిన ఈ పంచాయతీ కంప్యూటర్‌ ఆపరేటర్లు రోజుకో తీరుతో నిరసన తెలుపుతూ సమ్మె కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మహిళా ఆపరేటర్లు డిమాండ్ల ప్లకార్డులు పట్టుకొని అమ్మవారి విశ్వరూపంలో వినూత్నంగా చేశారు. అలాగే పురుష ఆపరేటర్లు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రమాద, ఆరోగ్యబీమా కల్పించి, కారుణ్య నియామకాలు చేపట్టాలని, మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, మృతి చెందిన ఆపరేటర్ల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్‌ మేనేజర్‌ చంద్రశేఖర్‌ గౌడ్‌ , అధ్యక్షుడు సాయి కుమార్‌, ప్రధాన కార్యదర్శి చీల హరీష్‌ కుమార్‌, ముఖ్య సలహాదారు నామ లక్ష్మణ్‌, కోశాధికారి రామస్వామి, ఉపాధ్యక్షులు వెంకటేష్‌, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రతిభా రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌ బ్రెయిన్‌తో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు నర్సింహారెడ్డి

పాపన్నపేట(మెదక్‌): సూపర్‌ బ్రెయిన్‌ వినియోగంతో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు నర్సింహారెడ్డి అన్నారు. పాపన్నపేట జూనియర్‌ కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవిత లక్ష్యాలను ఏర్పరుచుకుని ఆత్మన్యూనతా భావానికి గురికాకుండా ముందుకు పోవాలని సూచించారు. అందుకు యోగా మంచి మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ నర్సింలు, భాగ్యలక్ష్మి, ప్రవీణ్‌ కుమార్‌, రమేష్‌, అరుణ, విజయ కుమార్‌, రాములు, మృధుల, రాజు, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిప్పంటించిన నిందితులకు రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ, ఎస్‌ఐ గంగరాజు

దుబ్బాక రూరల్‌: మండలంలోని హబ్సిపూర్‌ గ్రామంలో బైండ్ల బాలవ్వ(52) గత నెల 7న హత్యకు గురైన విషయం అందరికి తెలిసిందే. హత్య చేసిన నిందితులు మద్దెల నవీన్‌ అతడి తల్లి చంద్రవ్వను గత నెల 19న రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 2న గ్రామానికి చెందిన కొంత మంది మహిళలు నిందితుల ఇంటి తాళం పగుల గొట్టి ఇంటిని ధ్వంసం చేయడమే కాకుండా ఇంటిలోని వస్తువులకు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. వచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారించి కొంత మందిని శనివారం రిమాండ్‌కు తరలించామని సీఐ కృష్ణ, ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. కొంత మంది పరారీలో ఉన్నారని వారిని కూడా పట్టుకుంటామని చెప్పారు.

పథకాలపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికివద్ద గల డాక్టర్‌ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యసంస్థ, వ్యవసాయ కళాశాలలో శిక్షణ పొందుతున్న ఏసీఏబీసీ (అగ్రి క్లీనిక్‌ అండ్‌ అగ్రి బిజినెస్‌ సెంటర్‌) వ్యవసాయ విద్యార్థులకు ప్రభుత్వ పథకాలపై శనివారం కౌడిపల్లి వ్యవసాయ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఏఈఓ రాజశేఖర్‌గౌడ్‌ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు వర్తించే పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో నోడల్‌ అధికారి మహేష్‌, ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌, వార్డెన్‌ జగదీష్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

పొలాల్లోకి ఆటో.. విద్యార్థినులకు గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థిని అక్షయ

శివ్వంపేట(నర్సాపూర్‌): విద్యార్థులను తీసుకొస్తున్న ఆటో రోడ్డు పక్కన పొలంలోకి దూసుకుపోవడంతో విద్యార్థులు గాయపడిన ఘటన శనివారం సాయత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధి తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన విద్యార్థులు చిన్నగొట్టిముక్లలోని ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. వారు రోజూ ఒక ఆటోలో వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలో శనివారం సాయత్రం పాఠశాల నుంచి విద్యార్థులతో వస్తున్న ఆ ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలోకి దూసుకెళ్లింది. ముగ్గురు విద్యార్థినులు అక్షయ, పూజ, మధుశ్రీ గాయపడగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందని గ్రామస్తులు చెప్పారు. ఈ ప్రమాదం పై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ రవికాంత్‌రావ్‌ తెలిపారు.

లైవ్‌ యువర్‌ డ్రీమ్స్‌ వర్క్‌ షాప్‌

సిద్దిపేటఅర్బన్‌: మండలంలోని పొన్నాల శివారులోని ఇందూరు ఇంజినీరింగ్‌ కళాశాలలో అశ్వ యూనిల్ఫ్‌ గ్రూపు, రోటరీ క్లబ్‌ ఆఫ్‌ కంటోన్మెంట్‌ ఆధ్వర్యంలో లైవ్‌ యువర్‌ డ్రీమ్స్‌పై శనివారం ఒక రోజు వర్క్‌షాప్‌ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీపీ రాజు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన అశ్వ యూనిల్ఫ్‌ గ్రూపు ఎండీ ఆచార్య వెంకట్‌ మాట్లాడుతూ.. కలలను కనండి వాటిని సాకారం చేసుకోండి, లక్ష్యాలు ఎంత స్పష్టంగా ఉంటే సాధించడంలో అంత విజయం పొందుతారన్నారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీపీ రాజు మాట్లాడుతూ లైవ్‌ యువర్‌ డ్రీమ్స్‌ గురించి తెలుసుకోవడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం అన్నారు. కార్యక్రమంలో పీఆర్వో రఘు, హెచ్‌అండ్‌ఎస్‌ హెచ్‌వోడీ పాండురంగం, మహేష్‌, మంగమ్మ, రఘురాం, రాకేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌ పాలసీలు ఉపయోగం

పెద్దశంకరంపేట(మెదక్‌): పోస్టల్‌శాఖ అధ్వర్యంలో అందిస్తున్న జీవితబీమా పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి సబ్‌ డివిజన్‌ మెయిల్‌ ఓవర్సీస్‌ డి.శ్రీనివాస్‌ అన్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు జాతీయ పోస్టల్‌ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో శనివారం తమ పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీపీఎంలు మాణయ్య, విజయ్‌కుమార్‌, గంగారం, రాఘవేందర్‌ పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు

- జెడ్పీ చైర్‌పర్సన్‌ హేమలత



సమైక్య భవనాన్ని ప్రారంభిస్తున్న హేమలత, ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్‌(తూప్రాన్‌): సీఎం కేసీఆర్‌ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడిందని జడ్పీ చైర్‌పర్సన్‌ ర్యాకల హేమలతశేఖర్‌గౌడ్‌, రాష్ట్ర ఫారెస్ట్‌ డెవలప్‌మెంట్‌ చైర్మన్‌ వంటేర ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌ అగ్రహారంలో శనివారం వారు సుమారు రూ.కోటితో నిర్మించిన పంచాయతీ భవనం, మిషన్‌ భగీరథ ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌, మహిళా సమైక్యభవనం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు రోజులుగా గజ్వేల్‌ నియోజకవర్గంలో సుమారు రూ॥1000 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. దళితబంధు గ్రామంలోని దళితులకు అందుతుందని, 10 వేల మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో తూప్రాన్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ బాలకృష్ణారెడ్డి, వైస్‌ ఎంపీపీ విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పురం మహేష్‌, సర్పంచ్‌లు రేణుక, మహిపాల్‌రెడ్డి, నాగభూషణం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో 8 మంది మృతి

చీరతో ఉరివేసుకుని..



వినోద్‌(ఫైల్‌)

వెల్దుర్తి(తూప్రాన్‌): చీరతో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాసాయిపేట మండలం కొప్పులపల్లి శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలగోని వినోద, శంకర్‌గౌడ్‌ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు వినోద్‌(24) పని ఉందంటూ ఈ నెల 5న ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. తిరిగి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం మూడురోజులుగా వెతికారు. శుక్రవారం ఉదయం వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్‌ శివారులోని ఓ చెట్టుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి, పెళ్ళి కావడం లేదనే మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వినోద్‌ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక..

పటాన్‌చెరు టౌన్‌: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌ రెడ్డి కథనం ప్రకారం... భగత్‌ గల్లికి చెందిన జాంగిర్‌ ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు తరచూ భార్య అమ్రిన్‌ సహేదాతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రికూడా వారి మధ్య గొడవ జరిగ్గా అమ్రిన్‌ సహేదా(30) రాత్రి బెడ్‌ రూమ్‌ లోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శనివారం మృతురాలి తండ్రి ఇస్మాయిల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని..

పటాన్‌చెరు టౌన్‌: మందులకని వెళ్లి తిరిగి వస్తున్న తన స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో మహిళ మృతిచెందిన ఘటన స్థానిక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డిలో ఉంటున్న యాసిన్‌ ఖురేషి భార్య జియాబేగంకు అనారోగ్యంగా ఉండంతో టోలిచౌక్‌ లో ఉంటున్న కుమారుడు పత్తేమహ్మద్‌ వద్ద నుంచి మందులు తీసుకువద్దామని వారి కూతురు అజీమాబేగం(35) శుక్రవారం వెళ్లి మందులు తీసుకుని స్కూటీ పై వస్తోంది. ఈ క్రమంలో ఇస్నాపూర్‌ సమీపంలోకి రాగానే ఆమె స్నేహితుడు ఫెరోజ్‌ఖాన్‌ కలిశాడు. వారిద్దరూ వస్తుండగా స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అజీమాబేగం తీవ్రంగా గాయపడింది. ఆమెను శ్రీకర్‌ ఆసుపత్రికి తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె సోదరుడు పత్తేమహ్మద్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపం చెంది..

జిన్నారం(పటాన్‌చెరు): కూరగాయలు తెచ్చేవిషయంలో భార్యతో గొడవ జరిగి మనస్తాపం చెంది అతిగా మద్యం తాగి ఉరివేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పీఎస్‌ పరిధిలో శనివారం జరిగింది. ఎస్‌ఐ దశరథ్‌ కథనం ప్రకారం వర్గల్‌ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన కోడిపట్ల మహేష్‌(40), భార్య సరిత పిల్లలతో బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని గాంధీ నగర్‌లో నివసిస్తున్నాడు. మహేష్‌ వంటపని చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం కూరగాయలు తెచ్చేవిషయలో మహేష్‌కు భార్యతో గొడవ జరిగింది. మనస్తాపం చెంది శనివారం అతిగా మద్యంతాగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్‌ భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోనిదర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

4 రోజుల క్రితం అదృశ్యమై..



నర్సింలు (ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం వర్గల్‌ మండలం తున్కిఖాల్సా సమీప చెరువులో కనిపించింది. గౌరారం ఎస్‌ఐ విజయభాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం నర్సాపూర్‌కు చెందిన పొడిపల్లి నర్సింలు(47) కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో గత నెల 4న బుధవారం భార్య అతనిడి మందలించింది. అదేరోజు అతను మనవరాళ్లను చూసొస్తానని తున్కిఖాల్సాలో కూతురు ఇంటికెళ్లాడు. పిల్లలను పలకరించి అదేరోజు తిరుగు ప్రయాణమైన నర్సింలు ఆ తరువాత ఆచూకీ లేకుండాపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం దక్కలేదు. మంగళవారం వారు గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బుధవారం తున్కిఖాల్సా చెరువులో నర్సింలి మృతదేహం లభ్యమైంది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌ గ్రామానికి చెందిన దర్శనం రామదాసు (65) చికిత్స పొందుతూ హైద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3న రామదాసు బెజ్జంకి క్రాసింగ్‌ రాజీవ్‌ రహదారిపై నుంచి ద్విచక్ర వాహనంపై గాగిల్లాపూర్‌ వెళుతుండగా కరీంనగర్‌ వైపు నుంచి వస్తున్న అబ్దుల్‌ పాషా తన వాహనంతో ఢీకొనడంతో రామదాసుకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి సోదరుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

హవేళిఘణాపూర్‌(మెదక్‌): తాగుడుకు బానిసైన ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నంచేసి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో శనివారం వెలుగుచూసింది. పాపన్నపేటకు చెందిన సీతానగరం అశోక్‌(32) బూర్గుపల్లికి చెందిన యశోదతో వివాహం జరిగింది. తాగుడుకు బానిసై తరుచూ గొడవలు పడేవాడు. ఈ క్రమంలో గత 23న ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకున్నాడు. అది గమనించిన భార్య యశోద వెంటనే మెదక్‌ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ తరలించారు. దీంతో గాం, దీలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్‌ తెలిపారు.

అత్తింటి వేధింపులు భరించలేక..



పద్మ (ఫైల్‌)

చిన్నకోడూరు(సిద్దిపేట): అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చిన్నకోడూరులో శనివారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన పల్లె పద్మ(36)కు 15 ఏళ్ల క్రితం చిన్నకోడూరుకు చెందిన పల్లె నర్సింలుతో వివాహం జరిగింది. కొన్నాళ్లుగా భర్త నర్సింలు, అత్త గంగవ్వ, మరిది సతీష్‌లు పద్మను వేధింపులకు గురిచేస్తున్నారు. మనస్తాపం చెందిన పద్మ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో శనివారం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సుభాష్‌ గౌడ్‌ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూముల సమస్యలను పరిష్కరించండి

- బీజేపీ కిసాన్‌ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేందర్‌నాయక్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): ధరణిలో పార్ట్‌(బి)లో చేర్చిన రైతుల పట్టాభూముల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేందర్‌నాయక్‌ డిమాండ్‌ చేశారు. చిన్నశంకరంపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ టి.మాందాపూర్‌, గజగట్లపల్లి, ఎస్‌.కొండాపూర్‌ గ్రామాలల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

కుటుంబ పాలనకు చరమగీతం

- బీజేపీ నేత ఈశ్వర్‌ సింగ్‌ ఠాకూర్‌



మాట్లాడుతున్న ఈశ్వర్‌ సింగ్‌ ఠాకూర్‌

మెదక్‌: రాష్ట్రంలో కేసీఆర్‌ కుటుంబ పాలన సాగిస్తున్నారనిఆయన కల్వకుంట్ల ఫ్యామిలీ అభివృద్ధికి కృషి చేస్తే ప్రధాని మోదీ దేశంలోని 140 కోట్ల ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తున్నారని కర్ణాటకకు చెందిన ఈశ్వర్‌ సింగ్‌ ఠాకూర్‌ అన్నారు. ఆ పార్టీ మెదక్‌ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో తొమ్మిదేళ్లగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఇచ్చిన నిధులను పవర్‌ పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా చూపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో తమ అభ్యర్థులను గెలిపించడానికి కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, నాయకులు మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపి, మురళీయాదవ్‌, నందు జనార్దన్‌ రెడ్డి, తాళ్లపల్లి రాజశేఖర్‌, బాలయ్య, పంజా విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

అలిగి వెళ్లిన డీసీఎంఎస్‌ చైర్మన్‌

- ఇంటికెళ్లి బుజ్జగించిన మంత్రి హరీశ్‌రావు
- గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక వివాదమే కారణం

జహీరాబాద్‌/ఝరాసంగం : ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఝరాసంగం మండలం బర్దీపూర్‌ గ్రామ శివారులో శనివారం హెలికాప్టర్‌ దిగిన వెంటనే ఓ ప్రజాప్రతినిధికి, డీసీఎంఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి సమక్షంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక జాబితాలో పేర్లు తారుమారు కావడమే అందుకు కారణమైందని తెలుస్తోంది. దీంతో అలిగిన శివకుమార్‌ హెలిపాడ్‌ వద్ద నుంచి జహీరాబాద్‌లోని తన ఇంటికి వెళ్లిపోయారు. ఝరాసంగం మండలంలో కార్యక్రమాలను ముగించుకున్న అనంతరం మంత్రి జహీరాబాద్‌ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యంలో ఉన్న డీసీఎంఎస్‌ చైర్మన్‌ ఇంటికి వెళ్లి బుజ్జగించి సమావేశానికి తీసుకువచ్చారు. దీంతో అంతా సర్దుకుంది.

దాతలను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్‌ రాజర్శి షా

శివంపేట (నర్సాపూర్‌): గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న దాతలను ప్రోత్సహించాలని కలెక్టర్‌ రాజర్శిషా అన్నారు. మండల పరిధి శభాష్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్న భాగ్యనగర్‌ కాపర్‌ పరిశ్రమ యజమాని రాకేష్‌ అగర్వాల్‌ను కలెక్టర్‌ అభినందించారు. శనివారం ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్‌ పార్వతీ సత్యంతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను రాకేష్‌ కలిశారు. కార్యక్రమంలో రవి నాయక్‌, సూపర్‌వైజర్‌ వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.